క్లుప్తంగా

నేడు విద్యాకానుక పంపిణీ

నారాయణవనం: మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సోమవారం జగనన్న విద్యా కానుక, యూనిఫారం పంపిణీ కార్యక్రమాన్ని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రారంభిస్తారని ఎంపీడీఓ గుణశేఖర్, ఇన్‌చార్జి ఎంఈఓ భారతి తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో జరిగే ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ



విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న మునిశేఖర్

ఏర్పేడు: మండలంలోని నచ్చనేరి ఎస్టీ కాలనీలో ఆదివారం యువనేస్తం అసోసియేషన్ సంస్థ ప్రతినిధులు విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. కాలనీలోని 20 మంది విద్యార్థులకు దుస్తులతో పాటు విద్యాసామగ్రి అందజేశారు. సంస్థ వ్యవస్థాపకుడు మునిశేఖర్ మాట్లాడుతూ.. దాతలు పేద విద్యార్థుల అభ్యున్నతికి కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు వినోద్, అరుణ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి మృతి



మునికృష్ణారెడ్డి (ఫైల్)

ఏర్పేడు: ఏర్పేడు పంచాయతీ కార్యదర్శి(డీడీఓ) మునికృష్ణారెడ్డి(58) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. రేణిగుంట మండలం మొలగమూడి గ్రామానికి చెందిన ఈయన గత ఐదేళ్లుగా ఏర్పేడు పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం స్వగ్రామమైన మొలగమూడిలో మృతి చెందారు. ఆయన మృతిపై సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య, ఎంపీడీఓ గిడ్డయ్య, ఈఓపీఆర్డీ మురగయ్య, పంచాయతీ కార్యదర్శులు సంతాపం తెలిపారు.

మృతదేహం అప్పగింత

ఏర్పేడు: మండలంలోని సీతారాంపేట వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వడమాలపేట గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న లలిత మృతిచెందిన విషయం తెలిసిందే. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి ఆదివారం తెలిపారు.


నాప్కిన్స్ తయారీపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఆప్కా గ్రీన్ ప్రొడక్ట్స్ సీఈఓ

శ్రీకాళహస్తి: లోక ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని సంతోష్‌పురం, జీఆర్‌దరఖాస్తు గ్రామాల్లో డీగ్రేడిబుల్ శానిటరీ నాప్కిన్స్ తయారీపై అవగాహన సదస్సు నిర్వహించా రు. తెలంగాణకు చెందిన అప్నా గ్రీన్ ప్రొడక్ట్స్ సీఈఓ అరుణ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు నాప్కిన్స్ ఆవశ్యకత, వాటి వల్ల ఉపయోగాలు, తయారీ గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ దీప, మాజీ ఎంపీపీ పోల య్య, లోక ఫౌండేషన్ ప్రతినిధి ఆచార్య ఆనందగిరిజీ, జీఎం సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనం



బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని లక్ష్మీపురం గిరిజన కాలనీలో అంగన్‌వాడీ భవనం నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఈ కేంద్రం పరిధిలో 32 మంది గర్భిణులు, బాలింతలు, పిల్లలున్నారు. ఈ భవనాన్ని ఆరేళ్ల నుంచి నిర్మిస్తూనే ఉన్నారు. భవనం లేకపోవడంతో గర్భిణులు, బాలింతలు, పిల్లలు అంగన్‌వాడీ కార్యకర్త ఇంటి వద్దకు వెళుతున్నారు. భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

30 నుంచి కపిలేశ్వరస్వామి పవిత్రోత్సవాలు

తిరుపతి కల్చరల్: కపిలేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 30వ తేదీ నుంచి జూలై 2 వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 29వ తేదీ సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు అంకురార్పణ చేపడతారు. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే అర్చనలు, ఉత్సవాల్లో తెలియక జరిగే దోషాలతో ఆలయ పవిత్రతకు లోపం రానీయకుండా శైవాగమశాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. ఈ నెల 30న ఉదయం ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, సాయంత్రం కలశ పూజ, హోమం, పవిత్ర ప్రతిష్ట చేస్తారు. జూలై 1వ తేదీ గ్రంధి పవిత్ర సమర్పణ, సాయంత్రం యాగశాల పూజ, హోమం చేపడతారు. జూలై 2వ తేదీ మహాపూర్ణాహుతి, కలశోద్వాసన, పవిత్ర సమర్పణ నిర్వహిస్తారు. సాయంత్రం ఏకాంతంగా ఆస్థానం నిర్వహిస్తారు.

రైతు నేస్తం

దుక్కు దున్ని..ఆరుగాలం శ్రమిస్తేనే రైతు కడుపు చల్లారుతుంది. ఆ రైతు వేసే ప్రతి గింజ మొలకెత్తి పది మందికి పట్టెడన్నం పెడుతోంది. అలాంటి కర్షకులకు రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పిస్తూ..వ్యవసాయ రంగ అభివృద్ధికి వెన్నుతడుతోంది. పల్లె వాకిటకు రైతు సేవలను తీసుకొచ్చింది. వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి సకల సదుపాయాలు కల్పిస్తోంది. విత్తు నుంచి పంట చేతికొచ్చే వరకు కేంద్రాల ద్వారా సహాయ సహకారాలు అందిస్తోంది.



ఆర్‌బీకేలో సబ్సిడీతో అందిస్తున్న వేరుశనగ విత్తనాలు

- రైతు భరోసా కేంద్రాల ద్వారా పల్లె వాకిటకు సేవలు
- అన్ని దశల్లోనూ రైతుకు చేయూత
- విత్తనం నుంచి విక్రయం వరకు అండ
- సాంకేతికత బదలాయింపులో కీలక పాత్ర
- ఫలితంగా వ్యవసాయ, పాడిపరిశ్రమ రంగంలో పురోగతి



మదనంబేడులో రైతు భరోసా కేంద్రం

సత్యవేడు: రైతు భరోసా కేంద్రాలు రైతులకు దుక్కు దున్నడం నుంచి పంట పండించే వరకు అండంగా ఉంటున్నాయి. తొలుత భూసార పరీక్షలు చేయించి ఆ భూమిలో ఏరకమైన పంటలు పండించాలో వ్యవసాయశాఖ సిబ్బంది నిర్ధారిస్తున్నారు. నిర్దీత సమయంలో రైతు ఖాతాకు పెట్టుబడి సాయం (రైతు భరోసా) జమ అవుతోంది. దుక్కులు దున్నేందుకు కావాల్సిన యంత్ర పరికరాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. ట్రాక్టర్లు, మడకలు, రోటావేటర్‌లు ఉన్నాయి. రాయితీతో డ్రిప్ పరికరాలు ఇస్తున్నారు. సీజన్‌ను బట్టి రైతుకు అవసరమైన వేరుశనగ, వరి, కందులు, పచ్చరొట్టె, అలసందలు, మొక్కజొన్నలు ఇలా పలు రకాల విత్తనాలను రాయితీ, ఉచితంగా కూడా ఇస్తోంది. హార్టికల్చర్‌లో భాగంగా పలురకాల పండ్ల తోటల పెంపకానికి అవసరమైన ప్రోత్సాహం అందిస్తోంది. తర్వాత విత్తన శుద్ధి మందులను సరఫరా చేస్తోంది. పంట సాగులో అవసరమైన యూరియా, డీఏపీ, పొటాష్‌యం, కాంప్లెక్స్, తెగుళ్ల నివారణకు కావాల్సిన మందులు కేంద్రాల్లోనే రైతులకు అందించేలా ప్రభుత్వం సదుపాయం కల్పించింది.

సత్యవేడు మండలంలో 14 ఆర్బీకేలు

మండల పరిధిలో 28 పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 14 రైతు భరోసా కేంద్రాలు సేవలు అందిస్తున్నాయి. మదనంబేడు, దాసుకుప్పం, ఆరూరు, ఇరుగుళం, పెద్ద ఈటిపాకం చెరివి, రాజగోపాలపురం, పీవీపురం, కన్నావరం, కాళమనాయుడుపేట, సత్యవేడు, ఏఎంపురం, శిరుణంబూదూరు, ఆంబాకం పంచాయతీల్లో యంత్ర సేవా కేంద్రాలు ఏర్పాటు చేశారు.

మండలంలో ఆర్బీకే సేవలు ఇలా..

సేవలు పొందుతున్న రైతులు :	4451 మంది
మట్టి నమూనాలు, భూసార పరీక్షలు :	390
రైతు భరోసా, పీఎం కిసాన్ కింద నాలుగేళ్లలో అందించిన మొత్తం :	రూ.23.27 కోట్లు
పొలంబడి కార్యక్రమాలు :	22
పంపిణీ చేసిన ఎరువులు :	425 మెట్రిక్ టన్నులు
పురుగు మందు :	260 లీటర్లు
ఈ-పంట నమోదు :	9, 643ఎకరాలు, 2645 మంది రైతులు
కౌలు రైతు గుర్తింపు కార్డులు :	34
మల్టీ ఫంక్షనల్ కియోస్క్‌లు :	14

విత్తనాల పంపిణీ

వేరుశెనగ –	599 క్వింటాళ్లు
జీలుగ –	200 క్వింటాళ్లు
జనుము –	80 క్వింటాళ్లు
నువ్వులు –	100 కేజీలు

కౌలు రైతులకు సకాలంలో సాయం



వైఎస్సార్ రైతు భరోసా ద్వారా ఏటా కౌలు రైతులకు కూడా రూ. 13,500 సాయం అందిస్తున్నారు. పెరిగిన సాగు ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ఈ సాయం ఎంతో సాయపడుతోంది. పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇస్తున్నారు. సీఎం జగన్ రైతుకు అండగా ఉంటున్నారు.
– శ్రీరామ శేఖర్, మదనంబేడు.

యంత్రాలతో ఎంతో ఉపయోగం



ప్రభుత్వం అందించే యంత్రాలతో వ్యవసాయ రంగానికి మరింత మేలు జరుగుతోంది. ఖరీదైన యంత్రాలు కొనుగోలు చేసే ఆర్థిక స్థోమత సన్న, చిన్నకారు రైతులకు ఉండదు. రైతు గ్రూపులకు ట్రాక్టర్లు, వరికోత యంత్రాన్ని ప్రభుత్వం రాయితీపై అందిస్తోంది. వైఎస్సార్ యంత్రసేవా పథకం ద్వారా ప్రభుత్వం నుంచి రాయితీపై యంత్రాలు పొందుతున్నారు. – ఎస్‌ఎం. వెంకటేశ్ మదనంబేడు

విప్లవాత్మక మార్పులు వచ్చాయి



రాష్ట్ర వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. నాలుగేళ్లుగా పంట సాగు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో లాభదాయకంగా మారింది. ప్రభుత్వం ఆర్‌బీకేల ద్వారా అనేక రకాలుగా రైతులకు చేయూత ఇస్తోంది. రైతులు పంట సాగులో అధిక దిగుబడి పొందేందుకు అధికారులు సూచనలు బాగుంది. – ఎం. చెంగల్రాయ శెట్టి, సత్యవేడు

ఆర్‌బీకేల్లోనే ఎరువులు



ఆర్‌బీకేల్లోనే రైతులకు ఎరువులు అందిస్తున్నాం. ఆధునిక, సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నాం. మట్టి నమూనాలు సేకరంచి భూసార పరీక్షల ద్వారా రైతుల వాడాల్సిన ఎరువుల మోతాదు వివరాలు తెలియజేస్తున్నాం. ప్రభుత్వం అందించే యంత్రాలు, ఎరువులు బయోమెట్రిక్‌తో అందిస్తున్నాం. – ఆర్ మురళి, ఏఓ సత్యవేడు.

విద్యుత్ సమస్యతో తాగునీటి ఇక్కట్లు

రేణిగుంట: మండలంలోని తండ్లం అరుంధతీవాడలో మూడు రోజులుగా విద్యుత్ సమస్యతో తాగునీటి ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. అరుంధతీవాడకు తాగునీటి బోరు ఉన్నా త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేయకపోవడంతో తాగునీటి సమస్య ఎదురైంది. ఈ విషయాన్ని స్థానికులు గ్రామ సర్పంచ్ పొడి సోమలతకు వివరించారు. ఆమె విద్యుత్ శాఖ ఏఈకి విన్నవించి విద్యుత్ సరఫరా చేయాల్సిందిగా కోరినా ఏఈ పట్టించుకోలేదని ఆమె వాపోయింది. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల గ్రామంలో తాగునీటితో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ మహోత్సవం



విశేష అలంకరణలో రేణుకా మాత

రేణిగుంట: మండలంలోని కృష్ణాపురం పంచాయతీ దిగువ మల్లవరంలో వెలసిన రేణుకా మాత వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అగ్నిగుండ మహోత్సవం జరిగింది. అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో వేసిన అమ్మవారి ముగ్గు ఆకట్టుకుంది. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి, రేణిగుంట సర్పంచ్ నగేషం, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఉత్సవ నిర్వాహకుడు డాక్టర్ రవిబాబు ఘనంగా సత్కరించారు. చిట్టమూరి చిన్నయ్య, పూజారి చెంగల్రాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్‌డే వేడుకలు



విద్యార్థులకు మెడల్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని సంతమైదానంలో ఉన్న ఆక్స్‌ఫర్డ్ డిగ్రీ కళాశాలలో ఆదివారం ప్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ చెవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, కంఠా ఉదయ్‌కుమార్, సుబ్బరామిరెడ్డి, రవీంద్రప్రసాద్, ఢిల్లీబాబురెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, మున్నా రాయల్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలకు వెళ్లడం దినచర్య కావాలి



విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న సర్పంచ్



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న శివయ్య

రేణిగుంట: గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలను చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవడం ప్రతి ఒక్కరూ దినచర్యగా పెట్టుకోవాలని రేణిగుంట సర్పంచ్ నగేషం అన్నారు. రేణిగుంటశాఖ గ్రంథాలయంలో వేసవి క్యాంప్ ముగింపు సందర్భంగా ఆదివారం చిన్నారులకు ధృవీకరణ పత్రాలు, బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రంథాలయాన్ని దేవాలయంగా భావించి ప్రతిరోజు దేవుని కృప కోసం దేవాలయానికి వెళ్లినట్టే విజ్ఞానం కోసం గ్రంథాలయాలకు వెళ్లాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి ఏ.శ్రీముఖి, విద్యావికాస వేదిక కన్వీనర్ వెంకటరమణ, డ్యాన్స్ మాస్టర్ శివ పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం

ఏర్పేడు: గ్రంథాలయాలతో విజ్ఞానం పెంపొందించుకోవచ్చని సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య అన్నారు. ఆదివారం ఏర్పేడు శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాల ముగింపు కార్యక్రమం జరిగింది. విద్యార్థులకు క్రీడలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు.
పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి మునిరాజమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



విద్యార్థులతో ప్రజాప్రగతి ట్రస్టు సభ్యులు

శ్రీకాళహస్తి: బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ప్రజాప్రగతి ట్రస్టు మండల కోఆర్డినేటర్ చంద్రశేఖర్ అన్నారు. అంతర్జాతీయ బాల కార్మిక నివారణ వారోత్సవాల్లో భాగంగా శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరి పారిశ్రామికవాడ, చటర్జీ నగర్, ఊరందూరు గిరిజనకాలనీ, అమ్మపాళెం దళితవాడ, పుల్లారెడ్డికండ్రిగ దళితవాడ గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. 18 సంవత్సరాల లోపు పిల్లలందరూ పనులకు పోకుండా బడిలోనే ఉండాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ఉపయోగించుకుని అభివృద్ధి బాటలో నడవాలని ఆకాంక్షించారు.
కార్యక్రమంలో ట్రస్టు సిబ్బంది చెంచురామిరెడ్డి, సురేష్, విద్యా వలంటీర్లు వసంత, పూజ, దాక్షాయని పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం



వాల్ పోస్టర్‌లు ఆవిష్కరిస్తున్న సంస్థ సభ్యులు

ఏర్పేడు: బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దామని ప్రగతి సంస్థ పాపానాయుడుపేట క్లస్టర్ కో–ఆర్డినేటర్ సుభాస్ చంద్రబోస్ అన్నారు. ఆదివారం మండలంలోని బత్తినయ్య ఎస్టీ కాలనీ, చెన్నప్పగుంట, గోవిందవరం, రావిళ్లవారికండ్రిగ ఎస్టీ కాలనీల్లో ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వాల్ పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. 18 ఏళ్లు నిండని పిల్లలను పనిలో పెట్టుకోరాదన్నారు. అధికారులు బాలకార్మికులను గుర్తించి వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ప్రగతి సంస్థ ప్రతినిధులు కోటేశ్వరమ్మ, రాజేశ్వరమ్మ పాల్గొన్నారు.

లారీ యూనియన్ సిల్వర్‌జూబ్లీ వేడుకలు



మాట్లాడుతున్న యూనియన్ అధ్యక్షుడు

రేణిగుంట: రేణిగుంట లారీ సప్లయర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ స్థాపించి 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం రేణిగుంట చెక్‌పోస్ట్ సమీపంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో యూనియన్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. యూనియన్ సభ్యులను ఘనంగా సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు గణపతిరాయల్, గౌరవాధ్యక్షుడు హనీఫ్, ఉపాధ్యక్షులు వెంకటరమణ, రాము, జయచంద్రబాబు, సెక్రటరీలు లక్ష్మీనారాయణ, వెంకటముని, జాయింట్ సెక్రటరీలు రాజారాయల్, కోటేశ్వరరావు, కోశాధికారి అరుణ్‌కుమార్, జాయింట్ ట్రెజరర్ శరవణన్ పాల్గొన్నారు.

వెలుగు సిబ్బంది నిర్లక్ష్యంపై ఫిర్యాదు

వరదయ్యపాళెం: మండలంలోని ఇందిరానగర్ గ్రామ పంచాయతీలో వెలుగు సిబ్బంది తన పేరిట జరుపుతున్న అక్రమ లావాదేవీలపై విచారణ చేపట్టాలని పంచాయతీ పూర్వపు గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు కూరపాటి నిర్మల కుమారి ఆదివారం రాత్రి వరదయ్యపాళెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. రెండేళ్ల క్రితమే వెలుగు గ్రామ సమాఖ్య అధ్యక్షురాలిగా తనను తొలగించారన్నారు. అయితే నేటి వరకు తనపేరిటే బ్యాంకుఖాతా నిర్వహిస్తూ.. ఆర్థిక లావాదేవీలు చేపుడుతున్నారని ఫిర్యాదులో పేర్కొంది. ఈ నెల 6న స్థానిక వరదయ్యపాళెం ఎస్‌బీఐ బ్యాంకు అధికారులు సంతకాలు తేడాగా ఉన్న చెక్కు తిరస్కరించడంతో ఈ అక్రమ లావాదేవీల తంతు బయటకు వచ్చినట్లు వాపోయింది. ఈ నెల 9న వెలుగు ఏపీఎంకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోగా అదే రోజున ఎంపీపీ భర్త వద్ద పంచాయతీ నిర్వహించి తనను అవమాన పరిచారని, వారిపై కూడా చర్యలు తీసుకోవాలని కోరింది.

ఘనంగా అంకాలమ్మ జాతర



జాతరలో పాల్గొన్న బియ్యపు పవిత్ర

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): తొట్టంబేడు మండలం పొయ్య పంచాయతీలోని గాబచేను గ్రామదేవత అంకాలమ్మ తల్లి జాతర ఆదివారం ఘనంగా జరిగింది. అమ్మవారిని వైఎస్సార్‌సీపీ తొట్టంబేడు ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉన్నం వాసుదేవనాయుడు, సర్పంచ్ మణి, నాయకులు మోహన్, గోపినాయుడు, నరసింహులు, లీలా ప్రసాద్, నాగేశ్వర్ రావు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న సీఐ సుబ్బరాయుడు

రేణిగుంట: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రేణిగుంట రూరల్ సీఐ సుబ్బరాయుడు అన్నారు. మండలంలోని తూకివాకంలో ఆదివారం రాత్రి గాజులమండ్యం పోలీసులు ప్రజలతో సమావేశమై పోలీసు సేవలను వివరించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు, చట్టవ్యతిరేక కార్యక్రమాలు జరుగుతుంటే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు. మహిళల కోసం ఉన్న ప్రత్యేక చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో గాజులమండ్యం ఎస్‌ఐ ధర్మారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పండరీ భజన



భజన చేస్తున్న భక్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పాకోట మైక్రోవేవ్ స్టేషన్ కాలనీ గ్రామదేవత గంగమ్మ జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండరీ భజన ఆకట్టుకుంది. అనంతరం అమ్మవారిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. కాలనీవాసులు పొంగళ్లు పెట్టి, అంబళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

కాలభైరవ క్షేత్రంలో అష్టమి పూజలు



నేతి దీపాలు వెలిగిస్తున్న భక్తులు

పిచ్చాటూరు: రామగిరిలో వెలసిన శ్రీకాళికాదేవి సమేత సంతాన కాలభైరవస్వామి ఆలయంలో అష్టమి పూజలు నిర్వహించారు. ఆదివారం త్రైపుర అష్టమి కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో కొలువుదీరిన కాళభైరవస్వామి, వాలీశ్వరస్వామి, మరగదాంబిగ అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ప్రమిదలు, గుమ్మడికాయలతో నేతి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో దాతలు అన్నదానం చేశారు. ఏర్పాట్లను ఆలయ ప్రధాన అర్చకుడు శంకర్ రాజ్ గురుకుళ్ పర్యవేక్షించారు.